
# కథ



# మనసు పిచ్చిది

- వలివేటి నాగచంద్రావతి

ఆయన వెనుక నుంచి బైక్ దిగి గుమ్మంలోకి అడుగుపెట్టానో లేదో పరిగెత్తుకుంటూ వచ్చేసింది శైలు. "వచ్చేశావా అమ్మా- అమ్మయ్య" అంటూ రెండు చేతుల్తో నా నడుము చుట్టేసి గోముగా నా భుజంమీద తల వాల్చింది- పదమూడేళ్ళకే నా అంతెత్తెదిగిపోయిన నా కూతురు. దాని మొహంలో ఎంతో రిలీఫ్.

అమ్మ ఎడబాటు సహించలేకపోయిందిగావున్ను బిడ్డ. 'పాపం తల్లంటే ఎంత ప్రేమో' అనుకుంటున్నారా- ఆ తరవాతి డైలాగు వినండి - "నువ్వో అరగంట ఆలస్యంగా వచ్చుంటే ఈ వెధవ పోనీటెయిల్‌తోనే స్కూలుకి వెళ్ళాల్సొచ్చేది. నిమిషనిమిషం లూజయిపోయి చస్తున్నాననుకో- ఈ మూడ్రోజులబట్టీ. దా... దా... ముందు నాకు చిక్కుతీసి జడలు వెయ్యి".

అదీ సంగతి.

ఒళ్ళు మండిపోయింది. ఆయనా అంతే. రిసీవ్ చేసుకోవటానికి స్టేషన్‌కొచ్చారా- చేతిలో సూట్‌కేసన్నా అందుకోలేదు. 'పద పద... నేనర్జంటుగా ఆఫీసుకెళ్ళిపోవాలి. ఇన్‌స్పెక్షన్. పైనుంచి దూతలు దిగారు. అన్నట్టు... మొన్న నువ్వూరెళ్ళేరోజున ఆఫీస్ బ్రీఫ్‌కేస్ తెచ్చి ఇంట్లో ఎక్కడో పెట్టాను. ఇంపార్టెంటు ఫైళ్ళున్నాయ్ అందులో. వెళ్ళగానే ముందది వెతికివ్వు. అర్జంట్' అంటూ ఏకతరుముడు.

ఇక మా అబ్బాయి కిరణ్ రియాక్షన్- "నీకేం చెప్పానమ్మా... నా బ్లాక్ షర్టూ, కాడ్‌రాయ్ ప్యాంటూ ఇస్త్రీచేసి వెళ్ళమన్నానా?"

"అదికాదురా..."

"సరె సరె, నీతో వాదిస్తూ కూర్చోడానికి నాకు టైమ్‌లేదుగానీ ముందవి ఐరన్ చేసిపెట్టు".

ఇక ఆగటానికీ ఆలోచించటానికీ ఆస్కారమెక్కడ? వాళ్ళవసరాలు తీరాలి. గుమ్మం దాటాలి. నామీద నేను జాలిపడ్డానిక్కూడా అప్పటిదాకా ఆగాల్సిందే. కాసేపు యంత్రాన్నయిపోయాను.

ముగ్గురూ ఇల్లు దాటారు. అప్పుడు స్థిమితంగా ఇల్లెలా ఉందా అని కలియ చూశాను. కిష్కింధలా ఉంది.

ప్రాణస్నేహితురాలి కూతురి పెళ్ళి. ఒక్క రోజు ముందురావే అని రోజుకి పదిసార్లు ఫోను. వెళ్ళాను. పెళ్ళయింది. అప్పగింతలైన తర్వాత అది దిగులుగా ఉంటే వదిలిరాలేక ఇంకోరోజు ఎక్స్‌ట్రా ఉండిపోయాను.

మూడే మూడురోజులు. నేను లేకపోతే ఇంటిరూపు ఎంత కమనీయంగా తయారుచేశారంటే- సింకు నిండా, ఆ కింద టబ్బునిండా అంట్లగిన్నెలు. నా అనుమానం నేను వెళ్ళాక ఒక్క చెంచా అయినా కడిగి ఉండరు. వాషింగ్ మెషీన్ పక్కన విడిచిన బట్టల మేట. ఇంటి నిండా దుమ్ము. ఎక్కడపడితే అక్కడ విసిరేసినట్టుగా పుస్తకాలు, కాగితం ఉండలు. మావాడు తోచనప్పుడల్లా చెల్లెల్ని ఏడిపించే ఆటతోపాటు పేపర్‌బాల్స్‌తో కూడా ఆడుకుంటుంటాడులెండి. టీవీ ముందర పళ్ళెంలో ఏదో స్వీటు. దాని చుట్టూరా బారులుతీరిన చీమలు.

రామచంద్రా... ఇల్లా ఇది, సెకండ్‌క్లాస్ ప్యాసింజర్ల వెయిటింగ్ రూముకాని.

ఇక పెరట్లోకి వెళ్ళి చూద్దునా- కోటలో ఉన్న తులశమ్మ వడలిపోయి దీనంగా చూస్తుంటే మిగతా కుండీల్లో మొక్కల సంగతి అడగనేల? నేను వెళ్ళేరోజున చీకటి వీడలేదని పెరట్లో వేసిన లైటు ఇప్పటికీ నమ్మకంగా వెలుగుతూనే ఉంది పాపం.

"నిన్న మోటారు వేసి ఉంచేసి, ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు. సాయంత్రందాకా ట్యాంక్ నిండి నీళ్ళు పోతూనే ఉన్నాయ్. నేను చెప్తేనే ఆపారు తరవాతైనా" పక్కింటావిడ ఫిర్యాదు.

"ఎప్పుడొచ్చినా మళ్ళీరా అంటారండి. నన్నేం చేయమంటారు?" పనిమనిషి సంజాయిషీ.

ప్చ్... ఏమనుకోను, ఎవరితో మొత్తుకోను. ఏళ్ళు వచ్చి ఆయనకీ బాధ్యత తెలీదు. పిల్లకాయలు వాళ్ళకీ డిసిప్లిన్ లేదు. ఓ రెస్పాన్సిబిలిటీ ఎవరికీ లేదు. ఎప్పుడొస్తుంది వైనం? ఎలా వీళ్ళతో వేగడం?

ఇల్లు సర్దేపనికి వంచిన నడుము పైకెత్తేవేళకి తిరిగొచ్చేసింది మా పటాలం.

"అమ్మా, ఏమన్నా పెట్టవా?" అని నా కూతురు.

"అబ్బ, ఆ బ్రెడ్డూ జామూ తినితిని బోరు కొట్టేసిందమ్మా. మంచి టిఫినేదన్నా చేసిపెట్టు" అని నా కొడుకు.

"అరె, ఈపాటికి తయారుచేసి రెడీగా ఉంచుతావనుకున్నాను. ఎలాగైనా ఈమధ్య నీ స్పీడు తగ్గింది స్మీ" అని మా ఆయన.

తిక్కరేగిపోయింది నాకు. "రైలుదిగి ఇంట్లో కాలుమోపిన దగ్గర్నుంచీ వంచిన తల ఎత్తకుండా చేస్తున్నాను చాకిరీ. ఇప్పటికీ కొలిక్కిరాక చస్తున్నాను. టిఫిన్ చేసిపెట్టాలా టిఫిన్" కయ్యిమన్నాను.

'అంత పనేం ఉందోయ్' అనబోయి బిగుసుకుంటున్న నా మొహంచూసి మాటమార్చి, "పనికంత తొందరేమిటోయ్. ప్రయాణం చేసొచ్చావ్. కాస్తంత రెస్టు తీసుకుని అప్పుడు ప్రారంభించొచ్చును గదా" అన్నారు మావారు సానుభూతిపూర్వకంగా.

"ఏమిటీ- రెస్టా? రెస్టు తీసుకునేటట్టు ఉంచారా ఇల్లు. ఏమే శైలు రాక్షసీ- నీకెన్ని సార్లు చెప్పానే- మంచాలమీద తుడుచుకున్న తువ్వాళ్ళు పడేయ్యొద్దనీ. దగ్గరకెడితే ముక్కు కంపు కొడుతున్నాయ్ దుప్పట్లు. ఆ సోఫాల నిండా ఈ కిరణ్‌గాడి ఇన్‌స్ట్రుమెంట్లే. చూసుకోకుండా కూర్చుంటే టెటనస్ ఇంజక్షన్ కోసం డాక్టరు దగ్గరికి పరిగెత్తాల్సిందే. ఇంట్లో నేల మీద అంగుళం మందానుంది దుమ్ము. ఇంకెక్కడ కూర్చోమంటారు? ఎక్కడ పడుకోమంటారు?" దులిపేశాను కోపంగా.

"నేను చెబుతూనే ఉన్నానోయ్. అమ్మకు నచ్చదూ, కాస్త సర్దండ్రా అనీ" మావారు అతి బుద్ధిమంతనంగా చెప్పబోయారు.

"ఆహాఁ- తమరు తక్కువతిన్నదేమిటీ. బెడ్‌రూమ్‌లో అద్దంముందు షేవింగ్‌సెట్టు ఆరిపోయి, ఎండిపోయి, మరకలు కట్టి. మరీమరీ చెప్పి వెళ్ళాను కరెంటు బిల్లు కట్టెయ్యండీ టైమయిపోతూందీ అని, కట్టారా? అబ్బే, ఒళ్ళస్సులు వంగటంలేదెవ్వరికీ".

కుయిక్కిమనకుండా ముగ్గురూ జారుకున్నారు నా ముందునుంచి. తలతిప్పి చూస్తే ఒకళ్ళు కంప్యూటర్ దగ్గరా, ఒకళ్ళు ఫైళ్ళమధ్యా, ఒకళ్ళు టీవీ దగ్గరా బిజీ అయిపోయినట్టు కనిపించారు. ప్రాణమొప్పక పెళ్ళింటి నుంచి తెచ్చిన అరిసెలూ కారప్పూసా లడ్డూలూ పళ్ళెం నిండా తీసుకెళ్ళి టీపాయ్‌మీద పెట్టేసి వచ్చేశాను. పావుగంట తర్వాత వెళ్ళిచూస్తే పళ్ళెంలో పలుకులేదు.

దీపాలవేళ- అప్పటికి కాస్త తీరికచిక్కి ఆరిన బట్టలు మడతేస్తూ దీవానుమీద కూర్చున్నాను. ఎక్కడ చూసిందో చదివే చదివే పుస్తకాన్నలాగే వదిలేసి వచ్చేసింది శైలు. అలవాటుగా నా వెనకాల వజ్రాసనం వేసుక్కూర్చుని వెనుక నుంచి నన్ను కౌగిలించుకుని గారాలుపోతూ

ముభావంగా ఉన్న నన్ను కూల్ చేసింది.

దానికి పోటీగా నా కొడుకు కూడా వచ్చేసి నా ఒళ్ళో తలపెట్టి పడుకున్నాడు. "నువ్వు లేకపోతే అస్సలు బాగలేదే అమ్మా" అంటూ నాకు ఐస్ పెట్టాడు.

మావారు కూడా "అమ్మయ్య నవ్వావా, ఇప్పుడు ఇల్లు ఇల్లులా ఉందోయ్" అన్నారు బోళాగా మందహాసం చేస్తూ.

ఎందుకో సేదదీరినట్టుగా ఉంది నాకు.

ఆ రాత్రి సురేఖ... అదే నా స్నేహితురాలు ఫోన్ చేసింది. పెళ్ళికి వచ్చినందుకు థాంక్స్ చెబుతూ, "ఇంకోరోజు నువ్వుంటే బావుండేదే" అంది.

"భలేదానివే. ఈ మూడ్రోజులకే ఇల్లు కంగాళీ కంగాళీ అయిపోయింది. మావాళ్ళు సొంత ఇంట్లోనే కాందిశీకుల్లా బిక్కుబిక్కు మంటూ ఉన్నారనుకో" అంటూ పొద్దుట్నుంచీ ఇల్లు యథాస్థితికి తీసుకురావటానికి నేనెంత శ్రమపడ్డానో చెప్పుకొచ్చాను.

నవ్వుతూ నవ్వుతూ అంతా విని "మరీ మీవాళ్ళకి స్పూన్‌ఫీడింగ్ నేర్పించేసినట్టున్నావ్. ఆనక సర్వెంట్‌మెయిడ్‌ని చేసేశారని నువ్వే బాధపడతావేమో జాగ్రత్త" అని ఫోన్ పెట్టేసింది.

నేను చేస్తున్న పొరపాటుని గుర్తుచేసిందా - నేను ఆలోచనలోపడ్డాను.

★ ★ ★

నేను ఒక నిర్ణయానికి వచ్చాను- నేనో రోబోలాగా అయిపోగూడదనీ మావాళ్ళని ఎలాగైనా మార్చి తీరాలనీ మర్నాడే ఆ పనికి శ్రీకారం చుట్టాలనీ. కానీ దేంతో ప్రారంభించాలో అర్థంకాలేదు.

స్నానంచేసి సోప్‌బాక్స్ నిండా నీళ్ళుంచేసి హాయిగా హమ్ చేసుకుంటూ వచ్చేయటం, టిఫిన్లూ భోజనాలూ లాగించేసి పళ్ళాల్లో చేతులు కడిగేసి ఆ చేతులు నా కొంగుకో కర్టెన్‌కో తుడిచేసి చక్కాపోవటం, దీవానుమీద దిళ్ళు కిందపడేసి ఇష్టమొచ్చినట్టు దొర్లటం, డోర్‌మేట్ మీద కాళ్ళు అన్నునైనా అన్నుకుండా పక్కనుంచి మురిక్కాళ్ళతో వచ్చేయటం... చెప్పుకుంటూ పోతే చేంతాడంత అవుతుంది లిస్టు. రోజూ వాళ్ళుచేసే ఈ వెధవ పనులు వెనుకనుంచి సరిచేసుకుంటూ వచ్చేసరికి నా పనిభారం రెట్టింపయిపోతోంది. ముందవి మానిపించాలి.

నాల్రోజులు వాళ్ళ వెనకవెనకే తిరుగుతూ, హెచ్చరిస్తూ, బెదిరిస్తూ, బతిమాల్తూ వాళ్ళపని వాళ్ళచేత చేయించేటప్పటికి తాతలు దిగొచ్చారు. ఆ తరవాత రెండ్రోజులు ఏం చేస్తారా అని సైలెంట్‌గా చూశాను. దార్లోపడ్డారు. సంతోషపడిపోయాను.

మూడోరోజు బాత్‌రూమ్‌లోంచి యథాప్రకారం నా కూతురి కేక, "అమ్మా టవలు... తలుపుమీద వెయ్". వేశాను. బయటకు వస్తూనే "అమ్మా, నా రిబ్బన్లు ఉతుకు. నెయిల్స్ కట్ చేయి. మొన్న ఆదివారం చెయ్యాలివన్నీ నువ్వు. అన్నీ మర్చిపోతున్నావ్" అని సతాయింపు.

మరిచిపోలేదు. మానేశాను. అంత చిన్న పనులు కూడా చేసుకోలేదూ...

"ఇవ్వాళ కూడా అలాగేవస్తే నీల్డవును చేయిస్తానన్నది మిస్".

అది బెదిరింపా - హెచ్చరింపా?

నాకేంలెమ్మని ఈరోజూ ఊరుకుందును. కానీ అది నిజంగానే నీల్డవును చేసి వేలాడి పోయొస్తే చూడలేనే.

ఇక మా కిరణ్‌గాడి రూటే వేరు. అడగటం, అభ్యర్థించటం అన్న మాటలు వాడి డిక్షనరీలోనే ఉండవు. "అమ్మా, నాన్న షూ పక్కనే నా షూ పెట్టాను. దాంతోపాటు ఇదీ చేసెయ్" ఆర్డరు. కాదంటే కథాకళీ. దర్జాగా షెల్ఫులో అట్టడుగుపుస్తకం ఒక్కలాగు లాగి పైపుస్తకాలన్నీ గుట్టగా కిందపడినా తనవి కానట్టే, "అమ్మా, ఇవి సర్దెయ్" అని చెప్పేసి ఈలేసుకుంటూ వెళ్ళిపోయాడు.



ఇక మతిమరుపు మారాజు మా ఆయన మిగిలారు. ఆఫీసుకని బయలుదేరారా... మూడుసార్లు వెనక్కొచ్చారు. ఓసారి పెన్ను కోసం, రెండోసారి వాచీకోసం, మూడోసారి ఆఫీస్ కీస్ కోసం వెనక్కొచ్చి, "అబ్బ, జానూ... నీ పంతమే నీదికానీ నేను ఆఫీసుకి తీసుకెళ్ళాల్సినవన్నీ టేబుల్‌మీద ముందే పెట్టేస్తే నాకీ తిరుగుడు ఉండదు కదా" అని విసుక్కున్నారు.

హుఁ, అంతా మొదటికొచ్చేశారన్నమాట. బద్ధకంలో ముదిరిపోయిన కేసులు మరి.

అయినాసరే వదిలిపెట్టను. వాళ్ళు మొండి అయితే నేను జగమొండిని.

సాయంత్రం వాళ్ళొచ్చాక తగవు పెట్టుకున్నాను. "ఇరవైనాలుగ్గంటలూ మీ సేవే నా డ్యూటీ అయిపోయింది. అరణపుదాసిలా దొరికాను కదా అని కాళ్ళకి మేజోళ్ళు అందించటం దగ్గర్నుంచి తలకి బ్రిల్‌క్రీమ్ రాయించుకునేదాకా వాడుకుంటున్నారు నన్ను" వస్తూ వస్తూనే టీ టీ అంటూ కాకిగోల పెడుతోన్న మావాళ్ళ మీద చిటపటలాడాను.

"ఛఛ, అదేం పోలికోయ్, దాసీ గీసీ అంటూ - నువ్వు ఈ ఇంటికి మహారాణివోయ్" బుజ్జగించారు మావారు.

"అవునవును. మహారాణి తువ్వాళ్ళూ లుంగీలూ అందిస్తుంది. షేవింగ్ బ్రష్ కడిగి పెడుతుంది" కసిగా అన్నాను.

"ఈ మహారాణీ సాహెబాగారి బంగారు హస్తాల్తో పరిచర్యలు చేయించుకోవటంలోనే ఈ మహారాజుకి తృప్తీ, ఆనందం దేవీ".

ఈ మెరమెచ్చు మాటలకేమీ కొదువలేదు మా ఆయనకి.

"అదికాదు నాన్నా, చేసుకోండీ చేసుకోండీ అని నసపెడుతుందా- మనం చేసుకున్న ఒక్క పనీ నచ్చదు మళ్ళా. చివరికి నా అంతట నేను క్రాఫ్ దువ్వుకున్నా పాపిడి సరిగ్గాలేదు అని మళ్ళీ దువ్వుతుంది. పుస్తకాలు సర్దుకున్నా ఎగుడు దిగుడుగా పెట్టావ్ అని విసుక్కుంటుంది. ఈ గోలంతా ఎందుకు తన ఇష్టప్రకారమే చేసుకొమ్మని వదిలేస్తే ఎలా విరుచుకుపడుతోందో చూడు" ఎప్పుడూ చేసేవాడల్లే తాగిన టీకప్పు సింక్‌లో కడిగేసి బోర్లిస్తూ అతి చమత్కారంగా అమాయకత్వం నటించాడు కిరణ్.

"ఆరి దుర్మార్గుడా, నెపం నామీదకే నెట్టావా!"

"అవునమ్మా. నీ అంత పర్‌ఫెక్ట్‌గా ఏ పనీ మేము అసలు చెయ్యలేం. నువ్వు చాలా గ్రేట్" నామీద వాలిపోయింది శైలు. అది ఒట్టి పేర సైటు. నామీద వాలిపోయే ఉంటుందెప్పుడూ..

టీ చారికలన్నా పోలా ఆ కప్పుమీద. తీసి మళ్ళీ కడుక్కుంటూ నిట్టూర్చాను. 'ఉహుఁ వీళ్ళని మార్చటం నావల్ల కాదు'.

★ ★ ★

అక్క ఫోన్ చేసింది. 'అమ్మకి ఒంట్లో బాగోలేదట. పక్కింటివాళ్ళు ఫోన్‌చేసి చెప్పారు. వెంటనే వెళదామంటే రేపు అమెరికా నుంచి అనిత వస్తోంది. అది దిగడం ఇక్కడ దిగినా రెండురోజుల్లో అత్తవారింటికి వెళ్తుందట. అదటు వెళ్ళగానే నేను అమ్మ దగ్గరికి వెళతాను. ఈలోపల నువ్వు వెళ్ళి నేనొచ్చేదాకా నాలుగు రోజులు అమ్మ దగ్గర ఉండగలవా?' అని.

అమ్మ... పెద్దదయింది. అక్క దగ్గరో నా దగ్గరో ఉండిపోమ్మా అంటే వినదు. 'సొంత ఊరు. నాన్న కట్టించిన ఇల్లు. కాలూ చెయ్యీ ఆడుతున్నంతకాలం వదలలేను' అంటుంది.

ఏమి సుస్తీ చేసిందో, ఎలా ఉందో? ఏడుపొక్కటే తక్కువ నాకు. కానీ నేను వెళ్తే ఇంట్లో ఎంత ఇబ్బంది.

"అలాగని మానేస్తావా ఏం? నాలుగు రోజులు ఎలాగో సర్దుకుంటాంలే వెళ్ళు. వీలయితే అమ్మని ఇక్కడికే తీసుకువచ్చేయ్" రైలెక్కించారు మావారు.

అమ్మకి వైరల్ ఫీవరు. అసలే నాదారి మనిషి. నాలుగురోజుల జ్వరానికే మంచానికంటుకుపోయింది.

"లేవలేకపోయినా మీకు కబురు చెయ్యనివ్వలేదు. నాకే ప్రాణం ఒప్పలేదు" అమ్మకి తెలీకుండా అక్కకి ఫోన్ చేసిన పక్కింటి మామ్మ చెబుతున్నారు.

అమ్మంతే. 'పుట్టిల్లంటే ఆడపిల్లకి వటవృక్షంగా ఉండాలి. ఇక్కడికి వాళ్ళు సేదతీరటానికి రావాలే

గానీ సేవ చేయడానిక్కాదు' అనేది ఎప్పుడూ.

అమ్మ అంటే అమ్మే. అమ్మ మనసు ఎప్పుడూ వెన్నపూసే. అమ్మవంక ప్రేమగా చూశాను.

ఇక అమ్మకి జ్వరం తగ్గి పథ్యం తీసుకునే దాకా ఇల్లూ పిల్లలూ ఆ పిల్లల తండ్రీ తలపుకు రాలేదు నాకు. వాళ్ళే ఫోన్‌చేసి అమ్మ క్షేమం కనుక్కుంటున్నప్పుడు తప్ప.

అమ్మ జ్వరం నార్మల్‌కి వచ్చింది. అక్క కూడా వచ్చేసింది. అప్పుడు ఆరంభమైంది గుబులు. ఇల్లెలా ఉందో, పిల్లలెలా ఉన్నారో అని.

'ఇద్దరం అమ్మతో కలిసి రెండురోజులుందాం ఉండవే' అని అక్కపోరు. తోసిపుచ్చలేకపోయాను. కానీ తనువిక్కడ మనసక్కడ. ఫోన్ రింగయితే డిస్టర్బ్‌గా అనిపిస్తోంది. 'అమ్మమ్మ ఫీవరు నార్మల్‌కి వచ్చింది కదూ' అని శైలు అడిగినా, 'డాక్టరింక ఫరవాలేదన్నాడు గదూ' అని మావారు ఆరాతీసినా ఆ సేకరణ వెనక ఇంక నువ్వు బయలుదేరొచ్చుగదా అన్న వేడుకోలే వినిపిస్తోంది.

మా అమ్మకి ఓపిక వచ్చేసింది. మాకిష్టమైన వంటకాలు చేసి పెట్టేస్తోంది. అక్క ఇంకా నాలుగురోజులు ఉంటానంది. నేను బయలుదేరిపోయాను.

అక్క స్టేషన్‌దాకా వచ్చి బై చెప్పింది. ట్రెయిన్ కదిలింది. అక్క కనుమరుగయింది. నా ధ్యాస ఇంటివైపు మళ్ళింది, ఇల్లొదిలి పదిరోజులయింది. పిల్లలెలా ఉన్నారో ఏమిటో? తలంటుకోక శైలు తల పేలుపట్టిపోయిందేమో. ఆ కిరణ్‌గాడు అండర్‌వేరన్నా ఉతుక్కుంటున్నాడో లేదో. మా బుద్ధావతారం అది మరచిపోయీ ఇది మరచిపోయీ ఇంటికీ ఆఫీసుకీ ఎన్నిమార్లు తిరుగుతున్నారో! ఇంట్లో దుమ్ము వాక్యూమ్ క్లీనర్‌కన్నా లొంగుతుందో లేదో. మళ్ళీ ఎన్నాళ్ళకి నా ఇల్లు నా ఇల్లులా నా చేతికివస్తుందో - పరిగెత్తే నా ఆలోచనల పరుగు ముందర రైలువేగం ఏం పనికొస్తుంది!?

ట్రెయిను దిగాను. ఆఫీసు టైము. ఆయన స్టేషన్‌కి రారని తెలుసు. మనుషుల్ని తప్పించుకుంటూ నాలుగడుగులు గేటువైపు వేశాను. ఆయన ఎదురొచ్చారు.

"విపరీతమైన ట్రాఫిక్. ఆలస్యమైపోయింది" అన్నారు నా చేతిలో సూట్‌కేసు అందుకుంటూ.

ఆఫీసుకు వెళ్ళాక కూడా నేను వస్తున్నట్టు ఆయనకి గుర్తుండటమే ఓ అద్భుతం.

నన్ను ఆటో ఎక్కించి ఆయన మళ్ళీ ఆఫీసుకు వెళ్ళిపోయారు. ఇంటిముందు ఆటో దిగాను. గేటు తెరవటానికి జంకు. వాకిలి వర్షాభావ ప్రాంతంలా ఎండిపోయి దుమ్ము రేగుతూ ఉంటుందేమోనని.

ఊహూఁ మొక్కలన్నీ పచ్చగానే ఉన్నయ్. ముఖ్యంగా తులశమ్మ. మా పనమ్మాయి దుర్గ పుణ్యం కాబోలు. మెయిన్‌డోరు తాళం తియ్యటానికి భయం. లోపల ఇన్‌కమ్‌టాక్స్ వాళ్ళు సెర్చిచేసి వెళ్ళినట్లు గజిబిజి అయిపోయుంటుందని.


ఆశ్చర్యం! ఇందాకే నేను ఇంటికి తాళంవేసి వెళ్ళొచ్చినట్టు ఎక్కడ సామాను అక్కడ నేను సర్ది పెట్టినట్టే ఉన్నాయ్. దాని దుంపతెగ వంటింట్లో సింక్ కూడా నీట్‌గానే ఉన్నదదేమిటో! ఆ విభ్రాంతిలోనే పెరట్లోకి నడిచాను.

"వచ్చేశారా, పుట్టింట్లో చాలారోజులు మకాం వేశారే" గోడమీంచి పక్కింటావిడ పలకరింపు. తరవాత రిపోర్ట్ కోసం ఎదురుచూశాను. నిల్. వెనక్కొచ్చేశాను.

రైస్‌కుక్కర్లో అన్నం, కాస్‌రోల్‌లో ఏదో కూర, గిన్నెలో సాంబారు టేబుల్ మీదున్నాయ్. రైల్లో ఉండగా ఆకలనిపించింది కూడా. కానీ ఇప్పుడు తినాలనిపించటంలేదేం?

ఏం చేయను, పనేంలేదు. అలసటగా ఉంది కానీ విశ్రాంతి తీసుకోవాలనిపించటం లేదు. అయినా వెళ్ళి పక్కమీద వాలాను. నిద్ర రావటం లేదు. ఏదో వెలితి. ఏదో మిస్సయిన ఫీలింగు. అనీజీగా, పక్కమీద దొర్లుతూ ఉండిపోయాను.

రాత్రి భోజనాలంటే మా ఇంట్లో హాయిగా కులాసాగా కబుర్లతో జోక్స్‌తో సాగే ఆహ్లాదకరమైన కార్యక్రమం. ఎప్పటి మాదిరిగానే



ఈ రోజూ ఉంది. కానీ నాకే ఏదో అసంతృప్తి. ఎవ్వరూ కూర బావుంది, పచ్చడి బావుంది అనన్నా అనరేం? అది వెయ్యి ఇది వెయ్యి అని అడగరేం?

మావారన్నారు- "జానూ, నీకు తెలుసా- శైలూ రసం ఎంత బ్రహ్మాండంగా పెడుతోందో? సగం అన్నం దాంతోనే తినేస్తున్నామనుకో. ఆ ఫార్ములా దాని దగ్గర నువ్వు కూడా నేర్చుకోవాల్సిందే".

"నిజంగానా? " దానివంక నవ్వుతూ చూశానే గానీ మనస్ఫూర్తిగానేనా అని నాకే అనుమానం.

కంచంలో వంకాయవేపుడు వెయ్యగానే మా కిరణ్‌కి ఇంకేదో గుర్తుకొచ్చింది. "అమ్మా, వంకాయతో నువ్విట్లా వేపుడో లేకపోతే ఆ నాస్టీ పచ్చిపులుసో చేస్తావ్. అంతేనా- మొన్నా క్రీపాయింట్లో ఈ వంకాయతోనే బగారా బేంగనో ఏదో పేరు చెప్పార్లే- అది తెచ్చాం. వావ్, అద్దిరిపోయిందనుకో. కదు నాన్నా, కదు శైలూ. అమ్మా వారానికోసారన్నా బైట నుంచి క్యారియర్ తెచ్చుకుందామే. కాస్త ఛేంజ్‌గా ఉంటుంది" అని ప్రపోజల్. 'ఔనౌ'నంటూ రెండు వంతపాటలు.

'అమ్మా, నీ వంట సూపర్బ్' అన్న నోరేనా నాస్టీ అంటున్నదీ- 'ఆరి దుర్మార్గుడా' వివర్ణమవుతోన్న నా మొహాన్ని దాచుకోవటానికి తంటాలుపడ్డాను.

తెల్లారింది.

"అమ్మా, నా టంక్లీనర్ కనబడ్డంలేదు", "జానూ రాత్రి నా స్పెక్ట్స్ ఎక్కడో పెట్టానోయ్. కాస్త చూసిద్దూ", "అమ్మా, అన్నయ్య చూడూ" - పొద్దుటే మా ఇంట్లో రొటీన్‌గా వినబడే ఈ సుప్రభాతాలేవీ వినపడలేదివాళ. నన్ను తలవకుండానే ఎవరిపని వాళ్ళు చేసుకుపోతున్నారు. నాకదోలా ఉంది. ఏ పనీ తోచట్లేదు. ఒక పని చెయ్యబోయి ఇంకోటి చేస్తున్నాను.

'పోనియ్, వాళ్ళు అడిగేదేమిటి. నేనే కలగజేసుకుంటే సరి'.

"రావే శైలూ, జడవేస్తాను. మళ్ళీ టైమయిపోయిందని గోలపెడతావ్" అని పిలిచాను- దువ్వెన కోసం గదిలోకి వెడుతూ.

"నేను వేసేసుకున్నాను లేమ్మా. చూడు, కుదిరాయా? " తలతిప్పి జడలు చూపించిందది.

ఆఖరికి మా సోమరిపోతు కిరణ్ కూడా భోజనంచేసి ప్లేటు సింక్‌లో వేశాడు. కడుక్కున్న చేతులు బుద్ధిగా నాప్‌కిన్‌కి తుడుచుకున్నాడు. కళ్ళప్పగించి చూశాన్నేను. ఒక్కపూటన్నా నాచేత నోట్లో ముద్దలు పెట్టించుకోందే తృప్తిపడని నా పిల్లలు అకస్మాత్తుగా ఎంతెదిగిపోయారూ!

కానీ...కానీ ప్రతీ పనికీ నన్ను విసిగించటం లేదని సంతోషంగాలేదేం? ఇరిటేటింగ్‌గా ఉందేం? ఏదో వంకన వాళ్ళమీద అరవాలని ఉంది. ఏ పనికైనా దగ్గరకొస్తే ఛస్తే చేయనని మొండికెత్తాలని ఉంది. ప్చ్, ఆ సందే ఇవ్వట్లేదు వాళ్ళు.

చిన్నపిల్లలకి వచ్చినట్టు ఉక్రోషం వచ్చేసింది. వాళ్ళ లంచ్‌బాక్సులు సర్దటం మానేశాను కావాలని. దానికీ స్పందించలేదు వాళ్ళు. అలవాటైన పనిలా బాక్సుల్లో టిఫిన్ వాళ్ళే పెట్టుకుని నాకు బై చెప్పేసి వెళ్ళిపోయారు పిల్లలిద్దరూ. హతాశురాలినయ్యానుగానీ అంతలోనే సర్దుకున్నాను.

'పిల్లలంతే. రెక్కలొస్తే ఎగిరిపోయేవాళ్ళు. వాళ్ళతో నాకేమిటి? ఆయనకి బ్రీఫ్‌కేసూ తాళాలూ ఇచ్చి వస్తాను. పాపం, మరిచిపోతే వెనక్కిరావాలి మళ్ళీ'.

హాల్లోకొచ్చాను. అప్పటికే తయారై ఉన్నారాయన. "ఇదిగో జానూ, బ్రీఫ్‌కేస్, ఆఫీసు కీస్, వాచ్, పెన్... అన్నీ పెట్టుకున్నాను చూశావా? " నవ్వుతూ చెప్పారు.

అవాక్కయ్యాను. ఈయనకి కూడా నా అవసరం లేదా?

గుమ్మం దాటారాయన. నేను చెయ్యూపే లోపల గేటు దాటారు.

తలుపుకు జార్లాబడ్డాను. మనసంతా శూన్యంగా ఉంది. నేను లేకపోతే క్షణం గడవదు అనుకున్నప్పుడున్న బలం, ఎంత పనిచేసినా తరగని ఆ ఉత్సాహం ఇప్పుడేది? నా కోడీ కుంపటీ లేకపోయినా తెల్లారిపోయింది అనుకున్నప్పుడు... నా కళ్ళనిండా నీళ్ళొచ్చాయి. ★